క్లుప్తంగా

సీతంపేటలోనే ఐటీడీఏ, డీడీ కార్యాలయాలు కొనసాగించాలి

సీతంపేట: సీతంపేటలోనే ఐటీడీఏ, డీడీ కార్యాలయాలను కొనసాగించాలని ఆదివాసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సామాజిక భవనంలో అత్యవసర సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పునర్విభజన కమిటీ సీతంపేటకు త్వరలో రానున్న నేపథ్యంలో అందరి అభిప్రాయాలు తీసుకుని తీర్మానం నివేదిక సమర్పించనున్నట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు బి.దమయంతినాయుడు, సవర మాలయ్య, తోట ముఖలింగం, ఎం.విశ్వనాథం, బి.రామ్మోహన్ రావు తదితరులు పాల్గొన్నారు.

26న మండల సర్వసభ్య సమావేశం

గరుగుబిల్లి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 26వ తేదీన మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.పైడితల్లి ఓ ప్రకటనలో మంగళవారం తెలిపారు. ఎంపీపీ ఉరిటి రామారావు అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి సర్పంచ్‌లు, ఎంపీటీసీలంతా హాజరవుతున్నారని, మండల స్థాయి అధికారులు పూర్తి అభివృద్ధి నివేదికలతో హాజరుకావాలని కోరారు.

రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని మూలిగూడ రోడ్డు నుంచి బాతుగుడబ గ్రామానికి బీటీ రోడ్డు నిర్మాణానికి కురుపాం ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి మంగళవారం భూమిపూజ చేశారు. బాతుగుడబ వరకు 2.3 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మాణాన్ని రూ.70 లక్షలతో చేస్తున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లు



బిల్లుమడ కాలనీలో కూలిన బూస పగడాలమ్మ ఇల్లు

భామిని: మండలంలో కురిసిన భారీ వర్షాలకు బిల్లుమడలో బూస పగడాలమ్మకు చెందిన రేకుల ఇల్లు సోమవారం రాత్రి కూలిపోయింది. కాలనీ వాసులు బాధితులను ఆదుకున్నారు. నేరడి బీకి చెందిన సరిసాబద్ర రమణమ్మకు చెందిన ఇంటి ముందు భాగం సన్‌సైడ్‌తో పాటు నేలమట్టమైంది. ఆస్తి నష్టాలపై వీఆర్‌వోలకు ఫిర్యాదు చేశారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

కొమరాడ: మండలంలోని మసిమండ గ్రామంలో నిరుపేద గిరిజనులకు సత్యసాయిబాబా భక్తులు మంగళవారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. బియ్యం, నూనె, బంగాళాదుంపలు, కందిపప్పు, ఉల్లిపాయలు తదితర సామగ్రి అందజేసినట్లు భక్తులు తెలిపారు.

కొనసాగుతున్న వర్ష ప్రభావం




రాజుపేట సమీప పంట పొలాల్లో చేరిన వర్షపు నీరు

పాలకొండ రూరల్: అల్పపీడన ప్రభావంతో మూడు రోజులుగా కురుస్తున్న వర్ష ప్రభావంతో మండల వ్యాప్తంగా జల వనరుల్లో పుష్కలంగా నీరు చేరింది. ముఖ్యంగా పంట కాలువల్లో నీరు ప్రవహించడంతో శివారు ప్రాంత రైతులు వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం నుంచి వర్షం తెరిపివ్వడంతో రైతులు పొలం బాట పట్టారు. వరి చేనుకు మంచి సమయంలో నీరు అందిందని పలు ప్రాంతాల రైతులు సంబరపడుతుండగా.. లోతట్టు ప్రాంత, కొండవాలు భూముల్లో అధిక మొత్తంలో వర్షపు నీరు చేరడంతో రైతులు ప్రత్యామ్నాయ పద్ధతుల ద్వారా నీటిని బయటకు పంపుతున్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి

జియ్యమ్మవలస రూరల్: గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణ శాఖ ఏఈ ఉమామహేశ్వరరావు ఆదేశించారు. మండలంలోని చినతోలుమండ గిరిజన గ్రామంలో చేస్తున్న ఇళ్ల నిర్మాణాలను ఆయన మంగళవారం పరిశీలించి, లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. శ్లాబు దశలోని ఇళ్లకు అవసరమైన సిమెంట్, స్టీలు, తదితర నిర్మాణ సామగ్రిని తానే మధ్యవర్తిగా ఉండి అందజేస్తామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు వితరణ చేశారు.

గర్భిణుల నమోదు సక్రమంగా చేపట్టాలి



చినగుడబలో రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డీఎంహెచ్‌వో పద్మావతి

గరుగుబిల్లి: గర్భిణుల నమోదు సక్రమంగా చేపట్టాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ కేవీఎస్ పద్మావతి సూచించారు. మండలంలోని ఉద్దవోలు, చినగుడబ గ్రామాల్లోని ఆరోగ్య కేంద్రాలను ఆమె మంగళవారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేసి, రోగులకు అందిస్తున్న వైద్య సదుపాయాలపై ఆరాతీశారు.

క్షణ క్షణం.. భయం..భయం..!



పెచ్చులూడి పడుతున్న శ్లాబ్ (ఇన్‌సెట్లో) డీఎల్‌పీవో కార్యాలయం కొనసాగుతున్న శిథిల భవనం

పాలకొండ డివిజన్ కేంద్రంలోని డీఎల్‌పీవో కార్యాలయం సిబ్బంది క్షణక్షణం.. భయం భయంగా విధులు నిర్వహిస్తునానరు. పాడుబడిన భవనాల్లో కొనసాగుతున్న కార్యాలయంలో విధులు నిర్వహించేందుకు సిబ్బంది భయపడుతున్నారు. నగర పంచాయతీ కార్యాలయం పరిధిలోని ఇందిరానగర్ కాలనీలో ఖాళీగా ఉన్న పా వసతిగృహ భవనాల్లో దీన్ని కొన్నాళ్లుగా నిర్వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ భవనం శిథిలం కావడంతో పైనుంచి పెచ్చులు పడుతున్నాయి. కింది భాగం కూడా బాగా దెబ్బతిని కిందికి కూరుకుపోతోంది. మూడు నెలల కిందట ఇంజినీరింగ్ అధికారులు ఈ భవనాలను పరిశీలించి వెంటనే ఖాళీ చేయాలని సూచించారు. భవనాలు కూలిపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఇటీవల భారీ వర్షాలు కురుస్తుండడంతో సిబ్బంది భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. – పాలకొండ

సబ్ కలెక్టర్ సుడిగాలి పర్యటన



గుమ్మడిగెడ్డలో వరద ఉధృతిపై తహసీల్దారుతో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ వైశాలి

కొమరాడ: మండలంలో పార్వతీపురం సబ్‌కలెక్టర్ డాక్టర్ ఆర్.వైశాలి సుడిగాలి పర్యటన చేశారు. తుపాను కారణంగా రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఏ ప్రాంతంలో ఎలాంటి పరిస్థితులు నెలకొన్నాయన్న అంశంపై ఆమె ఈ పర్యటన చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, వర్షాలకు గుమ్మడిగెడ్డ పొంగి అక్కడి రోడ్డుపై నీరు ఉధృతంగా ప్రవహించడాన్ని ఆమె మంగళవారం పరిశీలించారు. నీటి ప్రవాహం తగ్గినంత వరకు గెడ్డలోకి ఎవరూ దిగకుండా చర్యలు తీసుకోవాలని ఆమె అధికారులను ఆదేశించారు. అక్కడి నుంచి కొమరాడ తహసీల్దారు కార్యాలయం, పీఏసీఎస్ కార్యాలయం సహా ఎరువుల విక్రయ కేంద్రాలను పరిశీలించిన ఆమె..సిబ్బంది సక్రమంగా పనిచేయాలని, అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. అక్కడి నుంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వెళ్లి, అక్కడ ప్రజలకు అందిస్తున్న వైద్యసేవలపై ఆరాతీశారు. అనంతరం మండలంలోని సచివాలయం పరిధిలో చేసిన పలు సర్వేలపై సచివాలయ సిబ్బందిని ఆరాతీసి, పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దారు సీహెచ్ సత్యనారాయణ, ఎంపీడీవో ఎస్.రమేష్ తదితరులు పాల్గున్నారు.

వీరఘట్టం: పాలకొండ సబ్ కలెక్టర్ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం వీరఘట్టం మండలంలో సుడిగాలి పర్యటన చేశారు. విక్రంపురం గ్రామంలో, వీరఘట్టంలో ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్న పలువురు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. సొంత ఇల్లు ఉందా.. లేదా.. అని ఆరాతీశారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అచ్చెపువలస వద్ద ఇచ్చిన జగనన్న కాలనీ ఇళ్ల స్థలాలను సబ్ కలెక్టర్ పరిశీలించారు. ఇంత విశాలంగా ఉన్న ఈ స్థలంలో లబ్ధిదారులు ఎందుకు ఇల్లు కట్టుకోలేదని తహసీల్దార్ ఏఎస్ కామేశ్వరరావును అడిగి వివరాలు తెలుసుకున్నారు. గత ప్రభుత్వంలో ఇచ్చిన ఇళ్ల స్థలాలలో ఇళ్లు కట్టుకోవాలని లబ్ధిదారులకు చాలా సార్లు సూచించామని, ప్రభుత్వ పరంగా సహకారం అందిస్తామని చెప్పినా ఎవరూ ముందుకు రాలేదని తహసీల్దార్ తెలిపారు. అందువల్లనే ఇక్కడ ఈ స్థలం ఖాళీగా ఉండిపోయిందని ఆయన తెలిపారు. వీరితో పాటు ఆర్ఐ రవితేజ, వీఆర్‌వోలు బాసూరు శ్రీనివాసరావు, జి.రాజేంద్ర ఉన్నారు.

నాసిరకం తినుబండారాలు విక్రయించొద్దు

జియ్యమ్మవలస రూరల్: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఎంపీడీవో కె.ధర్మారావు సూచించారు. మండల కేంద్రంలోని సచివాలయ సిబ్బందితో మంగళవారం సమావేశమైన ఆయన.. పలు సూచనలు చేశారు. పాఠశాలల దగ్గరలోని దుకాణాల్లో విక్రయించే నాసిరకం పదార్థాలపై దృష్టి పెట్టాలని, అటువంటి పదార్థాల విక్రయాలు జరగకుండా చూడాలని తెలిపారు. ప్రతి విద్యార్థి ఇంటర్వెల్ సమయంలో తినుబండారాల కోసం దుకాణాలకు వెళ్తారని అప్పుడు దుకాణదారులు కాలం చెల్లిన పదార్థాలు అమ్మితే పిల్లలు అనారోగ్యానికి గురయ్యే అవకాశం ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా పోలీసులంతా షాపులను సందర్శించి, నాణ్యత లేని, నాసిరకం పదార్థాలు ఏవైనా అమ్ముతున్నారా లేదా అనేది పరిశీలించాలని కోరారు.

శ్రీవరి పద్ధతిలో వరినాట్లు వేయడం మేలు



వరినాట్లు వేయడాన్ని పరిశీలిస్తున్న జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ప్రహరాజ్

గుమ్మలక్ష్మీపురం: శ్రీవరి పద్ధతి లేదా వరుసక్రమంలో వరినాట్లు వేసుకోవడం ఎంతో మేలు అని జట్టు ట్రస్టు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్.ప్రహరాజ్ తెలిపారు. మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీలో ఉన్న బుడ్డెమ్మఖర్జ గ్రామంలో రైతు పేకాపు మురళి పొలంలో నవధాన్యాలు సాగు చేసినానంతరం శ్రీవరి పద్ధతిలో వరినాట్లు వేసే కార్యక్రమం మంగళవారం చేపట్టారు. వరినాట్లు వేయడాన్ని పరిశీలించిన ఆయన కాసేపు మాట్లాడారు. ఈ విధంగా వరినాట్లు వేసుకోవడం వల్ల పిలకలు ఎక్కువగా వచ్చి దుబ్బు ఏపుగా పెరుగుతుందని తద్వారా అధిక దిగుబడులు వస్తాయన్నారు. కార్యక్రమంలో జీవా ప్రాజెక్ట్ కో–ఆర్డినేటర్ జి.ప్రబోధ్, జట్టు ట్రస్టు కో–డైరెక్టర్ ఎం.నూకంనాయుడు, కో–ఆర్డినేటర్ జి.మురళిమోహన్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించాలి



వినతిపత్రం అందజేస్తున్న గిరిజన సంఘం, ఎస్ఎఫ్ఐ నాయకులు

గుమ్మలక్ష్మీపురం(కురుపాం): గిరిజన గ్రామాల్లో విరివిగా వైద్య శిబిరాలు నిర్వహించి, గిరిజనుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎ.మోహన్, బి.నాగేష్, ఎస్.పూజిత, ఎస్ఎఫ్ఐ నాయకులు ఎ.గంగారావు, చందు కోరారు. కురుపాం మండలంలోని జి.శివడ గ్రామంలో ఉన్న ఆరోగ్య కేంద్రాన్ని వీరంతా మంగళవారం సందర్శించి, అక్కడికి వచ్చే గిరిజనులకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ఎక్కువగా ప్రబలే అవకాశం ఉన్నందున గిరిజనులెవరూ జ్వరాల బారినపడకుండా చర్యలు తీసుకోవాలన్నారు. జ్వరాలపై ప్రజలను అప్రమత్తం చేసి, ఆరోగ్య సూచనలు ఇవ్వాలన్నారు. చాలామంది ఆస్పత్రులకు వెళ్లలేక ఇంటి వద్దనే మంచానపడి ఉన్నారని, వారందరికీ వైద్యసేవలు అందేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. అలాగే దోమల తెరలు పంపిణీ చేయాలని కోరారు. అనంతరం అక్కడి వైద్య సిబ్బందికి వినతిపత్రం అందజేశారు.

పాలకొండను జిల్లాగా ప్రకటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న సాధన సమితి గౌరవ అధ్యక్షుడు

పాలకొండ రూరల్: గతంలో జిల్లాల పునర్విభజన సమయంలో ఈ ప్రాంత వాసుల ఆకాంక్ష మేరకు అర్హతలు కలిగిన పాలకొండను జిల్లాగా ప్రకటించాలని కోరామని, ఇప్పుడైనా ప్రకటించాలని సాధన సమితి గౌరవ అధ్యక్షుడు కనపాక చౌదరి నాయుడు కోరారు. స్థానిక ఓ ప్రైవేటు కళాశాల ప్రాంగణంలో మంగళవారం సాధన సమితి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సమితి అధ్యక్షుడు బుడితి అప్పలనాయుడు మాట్లాడుతూ నాడు సమతుల్యతలో చోటు చేసుకున్న లోపాల కారణంగా స్థానిక రెవెన్యూ డివిజన్‌లో మండలాలు మూడు జిల్లాల్లో చేరాయన్నారు. ఇప్పుడైనా న్యాయం చేయాలని కోరారు. ఈ క్రమంలో ఈ నెల 13న ఏడుగురు మంత్రులతో చేపట్టిన ఉప సంఘం దృష్టికి తమ విజ్ఞాపన తీసుకువెళ్లామని తెలిపారు. నెలాఖరులోగా జిల్లాలో పర్యటించే ప్రభుత్వ బృందాలకు మళ్లీ వినతులు అందిస్తామని పేర్కొన్నారు. ఈ ప్రాంత వాసుల ఆకాంక్షను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లేందుకు ఈ నెల 21న కోటదుర్గమ్మ దేవస్థానం నుంచి ర్యాలీ చేపడతామని తెలిపారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

పాలకొండ రూరల్: ఇటీవల కురుస్తున్న భారీ వర్షాల కారణంగా లోతట్టు ప్రాంత రైతులు తమ పంటలు రక్షించుకునే క్రమంలో అధికారుల సూచనలు పాటించాలని వ్యవసాయ శాఖ ఏడీ కె.రత్నకుమారి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. వరి నాట్లు వేసిన పంట భూమిలో వర్షపు నీరు నిల్వ ఉండిపోతే అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. సదరు భూమిలో నీటి కాలువలు ఏర్పాటు చేసి అదనపు నీటిని బయటకు మళ్లించాలన్నారు. ఎకరాకు 20 కిలోల యూరియా, మ్యూరేట్ ఆఫ్ పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేయాలని సూచించారు.

పిల్లలకు వ్యాక్సిన్లు వేయించండి

గరుగుబిల్లి: పిల్లలకు విధిగా వేయించాల్సిన వ్యాక్సిన్లు వేయించాలని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి ఎస్.తిరుమల ప్రసాద్ సూచించారు. ఇదే విషయమై ఆయన ఆస్పత్రిలో మంగళవారం విలేకరులతో మాట్లాడారు. ఇంతవరకు ఎక్కడ పాఠశాలల్లోనైనా పిల్లలకు వ్యాక్సిన్లు వేయకుంటే ఈ నెల 23వ తేదీ వరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి వ్యాక్సిన్లు వేయడం జరుగుతుందని తెలిపారు.

వివరాలు అందించండి

పాలకొండ రూరల్: సాంకేతిక కారణాలతో పింఛన్లు కోల్పోయిన దివ్యాంగులు వారి వివరాలు మరోసారి ఎంపీడీవో కార్యాలయంలో అందజేయాలని ఎంపీడీవో విజయరంగారావు మంగళవారం కోరారు. ఈ మేరకు సచివాలయ సిబ్బంది గ్రామాల్లో దివ్యాంగులకు సమాచారం అందించాలన్నారు. ఇది వరకే అర్హత కోల్పోయినట్లు వచ్చిన నోటీసుతో పాటు పాత, కొత్త సదరం సర్టిఫికెట్లు, ఆధార్, వ్యక్తిగత దరఖాస్తుతో ఎంపీడీవోను సంప్రదించాలని సూచించారు. నగర పంచాయతీలో ఇవే వివరాలతో కమిషనర్‌కు అందజేయాలన్నారు. దరఖాస్తులను పరిశీలించి సంబంధిత జిల్లా ఉన్నతాధికారులకు అందజేస్తామని తెలిపారు.

ప్రమాదం జరగకుండా ఇలా...



లివిరి వద్ద ఏర్పడిన గండికి అడ్డంగా చీరకట్టుతో రక్షణ ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

భామిని: మండలంలోని లివిరి రోడ్డు వరదనీరు కొట్టుకుపోయి గండి పడింది. ఈ మార్గంలో ప్రయాణించే వారు రాత్రి పూట ఎటువంటి ప్రమాదానికి గురి కాకుండా ఉండేందుకు అధికారులు మంగళవారం ప్రత్యేక ఏర్పాటుచేశారు. గండికి అడ్డంగా యుద్ధ ప్రాతిపదికన చీరలతో అడ్డుకట్ట కట్టి కర్రలు పాతారు. రాత్రి వేళ ఎటువంటి ప్రమాదం జరగకుండా ఈ చర్యలు చేపట్టారు. తహసీల్దార్ శివన్నారాయణ, బత్తిలి ఎస్ఐ అప్పారావు ఆధ్వర్యంలో మండల అధికారులు ఈ ఏర్పాట్లు చేశారు.

ఆటో డ్రైవర్ల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

పాలకొండ : కూటమి ప్రభుత్వం తీరుపై ఆటో డ్రైవర్లు మంగళవారం ఆందోళన చేపట్టారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు దావాల రమణారావు మాట్లాడుతూ ఆటో డ్రైవర్లకు రూ.25వేల ఆర్థిక సహాయం అందించాలని డిమాండ్ చేశారు. ఫ్రీ బస్సు అమలుతో ఆటో డ్రైవర్లు స్వయం ఉపాధి కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం బోర్డు ఏర్పాటు చేయాల్సి ఉందని తెలిపారు. వాహన మిత్ర పథకం కింద నగదు అందిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఈ సమస్యలపై ఈ నెల 21 నుంచి నిరసన కార్యాక్రమాలు చేపడతామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కాద రాము, పి.శేఖర్, పి.మహేష్, డి.దుర్గారావు, కె.శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దారు కార్యాలయం సందర్శన



సబ్‌కలెక్టర్‌కు స్వాగతం పలుకుతున్న గిరిజన సంఘాల నాయకులు

గుమ్మలక్ష్మీపురం: స్థానిక తహసీల్దారు కార్యాలయాన్ని పాలకొండ సబ్‌కలెక్టర్ స్వప్నిక్ పవర్ మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయనకు కార్యాలయ సిబ్బంది, గిరిజన సంఘాల నాయకులు ఘనస్వాగతం పలికారు. తుపాను వర్షాల ప్రభావంతో జరిగిన పంటనష్టం గుర్తించే పనిలో ఉన్నామని, అలాగే ఎక్కడెక్కడ వానలకు ఇళ్లు కూలిపోయాయో..రోడ్లు పాడయ్యాయో..అనే వివరాలు కూడా తహసీల్దార్లను అడిగి తెలుసుకుంటున్నామని ఆయన తెలిపారు. సబ్‌కలెక్టర్‌ను కలిసిన వారిలో గిరిజన సంఘాల నాయకులు శంకరరావు, నాగేశ్వరరావు, ప్రసాద్‌రావు, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు బి.గౌరీశంకరరావు, తహసీల్దార్ ఎన్.శేఖర్ తదితరులు ఉన్నారు.

సైబర్ నేరాలపై తస్మాత్...



సీతంపేట: అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ

సీతంపేట: సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ వై.అమ్మన్నరావు తెలిపారు. స్థానిక సంతమార్కెట్ వద్ద ప్రజలకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెల్మెట్ లేకుండా ప్రయాణించవద్దన్నారు. వాహనదారులు లైసెన్స్‌లు కలిగి ఉండాలన్నారు. మైనర్లు వాహనాలు నడపవద్దన్నారు. ప్రతీ ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

● వరదనీటితో పోటెత్తిన గుమ్మడిగెడ్డ



తుపాను వర్షాల కారణంగా కొమరాడ మండలం, గుమ్మడిగెడ్డ వరదనీటితో పోటెత్తింది. దీంతో మాదలింగి వద్ద రోడ్డు పైనుంచి గెడ్డనీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. ఈ నేపథ్యంలో మాదలింగి నుంచి కురుపాం..కు ప్రజల రాకపోకలు నిలిచిపోయాయి. స్థానికులు అప్రమత్తమైన గెడ్డ రోడ్డుకు ఇరువైపులా దారికి అడ్డంగా తాడు కట్టి ప్రజలెవరూ ఆ దిశగా ప్రయాణించకుండా చర్యలు చేపట్టారు. –కొమరాడ

పేదలకు ఇచ్చిన భూములను అప్పగించాలి

వీరఘట్టం: మండలంలోని నర్సిపురం గ్రామంలో పేదలకు గతంలో ప్రభుత్వం ఇచ్చిన భూములను అప్పగించాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం నర్సిపురం గ్రామస్తులు ఆందోళన చేశారు. 2008 - 09 మధ్య కాలంలో గ్రామంలో భూముల్లేని 151 మంది పేదలకు భూములు ఇచ్చారని, అయితే కొందరికీ నేటికీ ఆ భూములు అప్పగించలేదని తహసీల్దార్ కామేశ్వరరావుకు వివరించారు.

అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ సంతనర్సిపురం భూ సమస్య ఓ కొలిక్కి వచ్చిందన్నారు. తమ సర్వే అధికారులు కొద్ది రోజులుగా అక్కడ సర్వే చేసి భూమిని గుర్తిస్తున్నారని తెలిపారు. వారం రోజుల్లో భూ సమస్యను పూర్తిగా పరిష్కరించి లబ్ధిదారులకు భూమి అప్పగిస్తామని తెలిపారు.

వన్‌ధన్ వికాస్ కేంద్రం పరిశీలన



మండలో చిరుధాన్యాల ఉత్పత్తుల తయారీ యంత్రాన్ని పరిశీలిస్తున్న వెలుగు పీడీ సుధారాణి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని తాడికొండ గ్రామంలోని వన్‌ధన్ వికాస్ కేంద్రాన్ని వెలుగు పీడీ ఎం.సుధారాణి మంగళవారం పరిశీలించారు. ఆ కేంద్రంలో చింతపండు కేకు తయారీ యంత్రం పనిచేయకపోవడానికి గల కారణాలపై ఆరాతీశారు. అక్కడి నుంచి ఇరిడి గ్రామైక్య సంఘానికి అందజేసిన టెంట్‌హౌస్ యూనిట్‌ను, ఆ తర్వాత మండ గ్రామం వెళ్లి ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులు, చిరుధాన్యాలతో తినుబండారాలు తయారు చేసే కేంద్రాన్ని సందర్శించి, మార్కెటింగ్, ప్యాకింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లోని సహజమైన అటవీ ఫలసాయాలను అందరూ కొనుగోలు చేయాలని ఆమె కోరారు. ఎవరికైనా యంత్ర సామగ్రి కొనుగోళ్లకు రుణం కావాలంటే అందజేస్తామని తెలిపారు. ఆమె వెంట వీడీవీకే డీపీఎం శ్రీరాములు, తదితరులు ఉన్నారు.

విరిగిపడిన కొండచరియలు



ఆగంగూడ రోడ్డులో పడిన కొండచరియలు



ట్రాక్టరు సాయంతో కొండచరియలను పక్కకు నెట్టివేస్తున్న దృశ్యం

తుపాను వర్షాలకు కురుపాం మండలం, వలసబల్లేరు పంచాయతీ, ఆగంగూడ బీటీ రోడ్డుపై కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో ఆ దారిలో ప్రజల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారంఈ విషయం తెలుసుకున్న నీలకంఠాపురం ఎస్ఐ నీలకంఠారావు ఘటన స్థలానికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. అనంతరం ట్రాక్టరు, జేసీబీ సాయంతో రోడ్డుపై కొండచరియలను తొలగించి, ఆ దారిలో ప్రజల రాకపోకలకు మార్గం సుగమం చేశారు. –కురుపాం

'ఉపాధి' పనుల్లో పారదర్శకతకే సామాజిక తనిఖీలు

గరుగుబిల్లి: ఉపాధి హామీ పథకం పనుల్లో పారదర్శకతకే సామాజిక తనిఖీలు నిర్వహించడం జరుగుతోందని ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు అన్నారు. మండలంలోని వల్లరగుడబ గ్రామంలో ఉపాధి పనులపై జరిగిన సామాజిక తనిఖీలకు సంబంధించి గ్రామసభ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీల్లో ఉపాధి పనుల్లో చేసిన వ్యయం, వేతనదారులు పొందిన వేతనాలపై తనిఖీలు చేయడం జరిగిందని తెలిపారు. ఈ తనిఖీల వివరాల వెల్లడికి మండల పరిషత్ కార్యాలయంలో ఈ నెల 23వ తేదీన ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ఆర్.గోవిందనాయుడు, ఎఫ్ఏ రామ్‌ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఆర్‌పీ పున్నపునాయుడు